వన్యప్రాణుల అవయవాలు విక్రయించేందుకు యత్నం

ముగ్గురు మహిళలు అరెస్ట్

అబిడ్స్, ఏప్రిల్ 18 పాత వస్తువుల విక్రయాలకు పేరుగాంచిన జుమ్మెరాత్‌బజార్ అంగడిలో నెమలి తలతో పాటు పలు ప్రాణుల అవయవాలను విక్రయించేందుకు వచ్చిన ముగ్గురు మహిళలను షాహినాయత్‌గంజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మహారాష్ట్ర జాల్నా ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు జుమ్మెరాత్‌బజార్‌లోని అంగడిలో నెమలి తలతో పాటు బ్లాక్ ఐబీస్ పక్షికి సంబంధించి నాలుగు పుర్రెలు, ఎనిమిది కాళ్లు, నకిలీ పులి చర్మం, గోర్లను విక్రయించేందుకు యత్నిస్తుండగా పసిగట్టిన పోలీసులు వారిని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. అటవీ శాఖకు చెందిన ఓ మాజీ అధికారి ఇచ్చిన సమాచారంతోనే పోలీసులు జుమ్మెరాత్‌బజార్‌లో దాడి జరిపి వీటిని పట్టుకున్నట్లు సమాచారం. అటవీ శాఖ అధికారులకు ముగ్గురు మహిళలతో పాటు నెమలి తలతో పాటు వన్యప్రాణుల అవయవాలను అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ విక్రయాలపై హైదరాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి విజయ్ కుమార్‌ను వివరణ కోరగా పోలీసులు అప్పగించిన మాంసపు అవయవాలు నకిలీవని తెలిపారు. నెమలి ఈకలు మాంసం ముద్దలకు పెట్టి విక్రయించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. నకిలీ అవయవాలు అని తేలడంతో ముగ్గురు మహిళలను వదిలేసినట్లు వివరించారు.

శిక్షణిచ్చి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

సిటీబ్యూరో, ఏప్రిల్18(నమస్తే తెలంగాణ): నిరుద్యోగ ఐటీ పట్టభద్రుల కోసం వినూత్న రీతిలో ఉచిత శిక్షణ ఇస్తూ వారికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఉద్యోగ ప్రమోద కృషి చేస్తుందని శ్రీనాథ ఆచారి తెలిపారు. శ్రీమాన్ మధ్వాచార్య మూల మహా సంస్థాన్ ఉత్తరాది మఠాధిపతి శ్రీసత్యాత్మ తీర్థ స్వామీజీ ఆదేశాలతో చేపట్టిన ఉద్యోగ ప్రమోద మొదటి బ్యాచ్ పూర్తయిన సందర్భంగా కాచిగూడలో హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదువుకునే విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందిస్తూ ఉద్యోగాలు కల్పించేలా మార్గదర్శిగా ఈ ఉద్యోగ ప్రమోద ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 17 మందికి ఉద్యోగాలు పొందారని, ప్రస్తుతం 200 మంది నమోదు చేసుకున్నట్లు వివరించారు. అనంతరం రాఘవేంద్ర ఆచారి రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, ఐటి రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులచే ఆన్లైన్లో విద్యార్థులకు ఈ ఉద్యోగ ప్రమోద ద్వారా స్కిల్ డెవలప్మెంట్ ఐటీలో మెలుకువలు, ఇంటర్వ్యూ ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై శిక్షణ అందిస్తునామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కిడ్నీ కేసు .. శ్రీలంకకు లింక్..!

విదేశాలలో కిడ్నీ మార్పిడి ముఠా కింగ్‌పిన్ ఎల్‌ఓసీ జారీ చేసిన రాచకొండ పోలీసులు పలువురు అరెస్ట్.. కేసు సీఐడీకి బదిలీ కానట్లే!

సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): అక్రమ కిడ్నీ మార్పిడి కేసులో నిందితులకు ఇతర రాష్ట్రాలతో పాటు శ్రీలంకకు కూడా లింక్‌లున్నట్లు రాచకొండ పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పరారీలో ఉన్న కింగ్ పిన్ పవన్ కోసం ఎల్‌ఓసీ జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి అప్పగించేందుకు నిర్ణయించినా అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాకపోవడంతో ఈ కేసును రాచకొండ పోలీసులే దర్యాప్తు పూర్తి చేసే అవకాశాలున్నాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 13 మందిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న పవన్ శ్రీలంకలో ఎక్కడున్నాడు, ఎవరి వద్ద ఆశ్రయం పొందుతున్నాడు అనే అంశాలపై దృష్టి పెట్టారు. జనవరి 21వ తేదీన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో అలకనంద దవాఖానాలో అక్రమంగా కిడ్నీల మార్పిడి జరుగుతుందని పోలీసులకు వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారే డోనీ, డోనర్లు ఉన్నారు. అయితే ఇదంతా అక్రమ పద్ధతిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుంది. కిడ్నీ కావాల్సిన వారిని, కిడ్ని ఇచ్చే వారిని హైదరాబాద్ తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా కిడ్నీలు మారుస్తున్న ఘరాణ ముఠా గుట్టును పోలీసులు బయట పెట్టారు. పోలీసులకు వచ్చిన ఫిర్యాదుతో అలకనంద దవాఖానలో పోలీసుల సోదాలు నిర్వహించారు, ఆ సమయంలో ఇద్దరు డోనర్లు, ఇద్దరు రిసీవర్లు ఉండడంతో వారిని గాంధీ దవాఖానకు తరలించారు. ఈ కిడ్నీ మార్పిడి రాకెట్ వెనుక ఉన్న వారిని గుర్తించారు. జీవన్‌దాన్‌తో పాటు ఇతరాత్ర మార్గాల ద్వారా కిడ్నీ అవసరమైన బిగ్ షాట్స్‌ను గుర్తించడం, పేదరికంలో ఉంటూ డబ్బు అవసరమైన వారిని గుర్తించి కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. ఒకో కిడ్నీ మార్పిడికి రూ.55 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు చేతులు మారుతుండగా అందులో రూ. 5 లక్షల వరకే కిడ్నీ ఇచ్చే వారికి అందుతున్నాయని, మిగతావి డాక్టర్లు, ఏజెంట్లు, ఆపరేషన్ థియేటర్ నిర్వాహకులు, దవాఖాన నిర్వాహకులు ఇలా పంచుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో జనవరి 25వ తేదీన అలకనంద దవాఖాన నిర్వాహకుడు సుమంత్ ఈ వ్యవహారంలో కీలకంగావ్యవహరించిన జనరల్ సర్జన్ సిద్దంశెట్టి అవినాష్, దళారులు ప్రదీప్, సూరజ్ మిశ్రా, మెడికల్ అసిస్టెంట్స్ గోపి, రమావత్ రవి, రవీందర్, హరీష్, సాయిలను అరెస్ట్ చేశారు. కిడ్నీ అక్రమ దందాలో కీలకంగా వైజాగ్‌కు చెందిన పవన్ వ్యవహరిస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఇతడి కోసం పోలీసులు గాలింపు చేపట్టడంతో శ్రీలంకలో తలదాచుకున్నట్లు తెలిసింది. గతంలో శ్రీలంకలో అక్రమ కిడ్నీ రాకెట్ల దందాను పవన్ నిర్వహించాడు. ఇందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారితో పాటు తమిళనాడు, కర్ణాటకకు చెందిన వారికి కిడ్నీ మార్పిడి అవసరమైందంటే శ్రీలంకకు తీసికెళ్లి మార్పిడి చేసేవారు. ఈ క్రమంలోనే అక్కడ ఉన్న దవాఖానలు, వైద్యులు, కిడ్నీ మార్పిడి రాకెట్‌తో పవన్‌కు మంచి సంబంధాలున్నాయి. ఇందులో భాగంగానే ఇక్కడ కేసు కాగానే పవన్ శ్రీలంకకు వెళ్లి తలదాచుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు.

కిడ్నీ ఎవరికి అవసరం..!

కిడ్నీ రాకెట్‌లో కీలక సూత్రధారిగా ఉన్న పవన్ 2022లో మియాపూర్ ప్రాంతంలో ఒక దవాఖానను నిర్వహించాడు. అదే సమయంలో కిడ్నీల అక్రమ మార్పిడి వ్యవహారంలో పవన్ కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో ఏపీలో కిడ్నీల రాకెట్‌కు సంబంధించి 2023లో కేసు నమోదైయింది. ఈ కేసులో పవన్, పూర్ణ, రాజశేఖర్‌లు అరెస్టయ్యారు. ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత పవన్ నేరుగా కిడ్నీ అవసరమైన వారిని గుర్తించడం, డోనర్లను గుర్తించడం, కావాల్సిన దవాఖానాలను వెతికిపెట్టేందుకు తన నెట్‌వర్క్‌ను విస్తరించాడు. దీంతో 2022 నుంచి హైదరాబాద్‌లోని జననీ, అరుణ, అలకనంద దవాఖానాలో 2025 వరకు భారీ సంఖ్యలో కిడ్నీ మార్పిడీలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారు. ఈ ముఠాలకు పవన్ సూత్రదారిగా వ్యవహరిస్తూ కిడ్నీల దందా నిర్వహించినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా కిడ్నీ అవసరం ఎవరికి ఉంది అనే విషయాలను గుర్తించేందుకు ఈ ముఠా కొందరకు వైద్యుల సహాయం కూడా తీసుకున్నట్లు విచారణలో బయటపడింది. అయితే వైద్యుల వద్ద నుంచి కిడ్నీ అవసరం ఎవరికుందనే సమాచారాన్ని తీసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో బయట పడింది. అయితే ఇదంతా కర్ణాటక, తమిళనాడులోనే ఈ నెట్‌వర్క్ పనిచేస్తుందని, హైదరాబాద్‌లో కేవలం దవాఖానలలోని ఆపరేషన్ థియేటర్లను వాడుకున్నారని పోలీసుల విచారణలో బయటపడింది. అయితే కీలక నిందితుడి దొరికితే ఈ కేసులో ఇంకా ఎవరికైన సంబంధాలున్నాయా అనే సమాచారం కూడా వస్తుందని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో ముడిపడి ఉండడం, కీల క నిందితుడు విదేశాలకు పారిపోవడంతో ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేస్తుందని అందరు భావించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంలోని ఓ మంత్రి సైతం కేసును సీఐడీకి బదిలీ చేస్తామన్నారు. మూడు నెలలవుతున్నా ఇప్పటి ఎలాంటి ఆదేశాలు పోలీసులకు అందలేదు. దీంతో రాచకొండ పోలీసులే ఈ కేసు విచారణను పూర్తి చేయనున్నారు. కీలక నిందితుడు పవన్‌ను పట్టుకుంటేనే ఈ కేసు దర్యాప్తు పూర్తి అయ్యేందుకు అవకాశముంటుంది.

నేను ఇష్టపడుతున్న యువతిని.. పెండ్లి చేసుకోవద్దు

నేను ఇష్టపడుతున్న యువతిని నీవు పెండ్లి చేసుకోవద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తుండడంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారితీసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మణికొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇస్లామ్ అనే యువకుడికి ఇటీవల ఓ యువతితో పెళ్లి కుదిరింది. కాగా నౌషాద్ అనే వ్యక్తి పలుమార్లు ఇస్లామ్‌తోపాటు అతడి సోదరుడు నిజామ్ అలీకి ఫోన్లు చేస్తూ తాను ఇష్టపడుతున్న యువతిని పెండ్లి చేసుకోవద్దని, పెండ్లిని రద్దు చేసుకోవాలంటూ హెచ్చరిస్తున్నాడు. తన దగ్గరికి వస్తే మరిన్ని విషయాలు చెబుతానంటూ అల్కాపూర్‌కు రావాలని సూచించాడు. దీంతో శుక్రవారం ఇస్లామ్ అక్కడికి వెళ్లగా నౌషాద్‌తో తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఎన్నిసార్లు చెప్పినా వినకపోతే నీ సంగతి చూస్తానంటూ నౌషాద్ బెదిరించారు. అదే రోజు సాయంత్రం ఇదే విషయాన్ని గురించి ఓయూ కాలనీలోని సెలూన్‌లో పనిచేస్తున్న సోదరుడు నిజామ్ అలీకి చెప్పాడు. దీంతో నిజామ్ అలీ, నాజిమ్‌లు సెలూన్ ముందు నిలబడి మాట్లాడుతుండగా అక్కడకు వచ్చిన నౌషాద్, షాదాబ్, అఫ్జల్‌తో పాటు మరికొంతమంది వారిద్దరిపై కర్రలతో దాడి చేశారు. బాధితుడు నిజామ్ అలీ ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల్లో కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

108 అంబులెన్సులో మహిళ ప్రసవం

తల్లిబిడ్డా క్షేమం

ప్రసవించిన బిడ్డతో లక్ష్మి

ఉప్పల్ , ఏప్రిల్ 18 : మేడిపల్లి ప్రాంతానికి చెందిన మహేష్ యాద్ సతీమణి లక్ష్మీకి పురుటి నొప్పులు రావడంతో ఇబ్బంది పడుతుండగా 108 అంబులెన్స్ కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న ఉప్పల్ 108 సిబ్బంది హుటాహుటిన మేడిపల్లికి వచ్చి గాంధీ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్తుండగా ఉప్పల్ దగ్గరలో ఆమెకు పురుటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. తల్లి బిడ్డను ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాయిన్ చేశారు. 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నాగరాజు, పైలట్ ఉపేందర్ హాస్పిటల్లో చేర్పించడం జరిగింది.

బాలికను కాపాడిన ఫైర్ స్టేషన్ సిబ్బంది

బాలికతో ఫైర్ స్టేషన్ సిబ్బంది

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 18 : ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు బాల్కనీలో చిక్కుకున్న బాలికను ఫైర్ సిబ్బంది కాపాడారు. ముషీరాబాద్ మెయిన్ రోడ్ లో గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న విజేత సంజీవని అపార్ట్ మెంట్ లోని నాలుగో అంతస్తులో శుక్రవారం సాయంత్రం ఓ రెండేళ్ల బాలిక బాల్కనీలో చిక్కుకున్నది. మూసుకున్న తలుపు తెరవలేకపోవడం వలన బాలిక ఏడవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన గురయ్యారు. వెంటనే ముషీరాబాద్ ఫైర్ స్టేషన్ కి ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్న ఫైర్ ఆఫీసర్ బి. నరసింహ పర్యవేక్షణలో సిబ్బంది సత్యనారాయణ, కృష్ణ, చంద్ర ప్రకాష్, హేమంత్ కుమార్ లు పాపను సురక్షితంగా కాపాడారు. అనంతరం ఫైర్ స్టేషన్ సిబ్బందికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన బాలుడు

బేగంపేట్ ఏప్రిల్ 18: ఆరు బయట ఆడుకుంటున్న బాలికను గది లోపలికి తీసుకుపోయి ఓ బాలుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నానగర్ ప్రాంతానికి చెందిన బాలిక(9), గురువారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతంలో నివసించే బీహార్ రాష్ట్రానికి చెందిన బాలుడు(16) చాక్లెట్ ఇస్తానంటూ లోనికి తీసుకుపోయాడు. చేతులు కట్టేసి బాలిక పట్ల అసభ్యంగా వ్యవహరించాడు. బాలిక కేకలు వేస్తూ పారిపోయి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని, అతన్ని జ్యువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరుస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కాంపౌండ్ వాల్ గోడ కూలీ మృతి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18: బహుళ అంతస్తుల నిర్మాణ రంగంలో పనులు చేస్తున్న ఓ కూలీ పై కంపౌండ్ వాల్ గోడ కూలడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ధర్మేష్ తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిడుతపల్లి గ్రామానికి చెందిన బొల్లి చెన్నయ్య (55) గత కొన్నేళ్ల కిందట నగరానికి వలస వచ్చి భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం దూలపల్లి లో కన్జీసెన్స్ బిల్డర్స్ కు చెందిన బహుళ అంతస్తుల నిర్మాణ పనులు చేస్తుండగా పక్కన ఉన్న కాంపౌండ్ వాల్ గోడ అకస్మాత్తుగా కూలడంతో చెన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోబోటిక్‌తో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

ప్రొఫెసర్ రోవన్ పార్క్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): రోబోటిక్ సర్జరీలు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తేవడమే కాకుండా రోగులకు మరింత మెరుగైన వైద్యం అందిస్తాయని ఎడిన్‌బర్గ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ప్రొఫెసర్ రోవన్ పార్క్స్ అన్నారు. 'ప్రాథమిక స్థాయి నుంచి అభివృద్ధి చెందిన రోబోటిక్ సర్జరీ' అనే థీమ్‌తో రామోజీఫిల్మ్‌సిటీలో ఏర్పాటు చేసిన 2వ అంతర్జాతీయ 'అడ్వాన్స్‌డ్ రోబోటిక్ ఇన్నోవేషన్ సర్జరీస్' సదస్సుకు ప్రొఫెసర్ రోవన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోబోటిక్, విన్నూత్న శస్త్రచికిత్సల్లో ఉన్న పురాతన అంశాలకు, ఆధునిక అడ్వాన్స్మెంట్స్‌కి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటరాక్టివ్ వర్క్ షాప్‌లు,మేధోమథనం, ట్రైనింగ్ సెషన్‌లతోపాటు ఎంతో ఆలోచింపజేసే చర్చల ద్వారా, నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఈ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. రోబోటిక్ సర్జరీ అనేది సాధారణంగా జరిపే లాప్రోస్కోపిక్ సర్జరీల కన్నా అత్యుత్తమమైన టెక్నాలజీతో రూపొందించడం జరిగిందన్నారు. సంస్కృతి, వారసత్వం, టెక్నాలజీ పరంగా ఎంతో ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ నగరంలో ఈ సదస్సును నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, సెక్రటరీ డా.బాలవికాస్ మాట్లాడుతూ.. ఇన్నోవేటివ్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు ఈనెల 18నుంచి 20వరకు 3రోజులపాటు జరుగుతుందన్నారు. ఈ సదస్సు వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సర్జన్లు, పరిశోధకులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు తదితరులందరినీ ఒకచోట చేర్చడం జరిగిందన్నారు. ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి ఆయా విభాగాలకు చెందిన 700 మంది వైద్యనిపుణులు పాల్గొన్నారన్నారు. సదస్సులో భాగంగా అపోలో హాస్పిటల్ నుంచి లైవ్ సర్జరీలను నిర్వహించడం జరుగుతుందని డా. బాలవికాస్, డా.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండింగ్ ప్రెసిడెంట్ డా.సుభాష్ కన్నా, చీఫ్ అడ్వైజర్ డా. సురేశ్ చంద్ర, ఆర్గనైజింగ్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, సెకటరీ డా. బాలవికాస్, ట్రెజరర్ డా. కృష్ణ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. ఈ బస్సులో గోవాకు ప్రయాణమా..

తరుణి ట్రావెల్స్‌కు చెందిన బస్సు

గుభేలుమన్న ప్రయాణికుల గుండెలు అరిగిన టైర్లు.. పనిచేయని ఏసీ భరించలేని దుర్వాసన బాధితులు పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్, ఏప్రిల్ 18 : అరిగిన బస్సు టైర్లు.. పని చేయని ఏసీ.. బస్సంతా దుర్గంధభరితం..హైదరాబాద్ నుంచి గోవాకు బయలుదేరిన డొక్కు బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు దిగారు. బుక్ చేసిన బస్సు కాకుండా మరో బస్సులో ఎక్కించి మోసానికి పాల్పడ్డారంటూ తరుణి బస్సు ఆపరేటర్ తో వాగ్వాదానికి దిగారు. ఎల్బీనగర్ నుంచి గోవాకు వెళ్లే 25 మంది ప్రయాణికులు ఆందోళనకు దిగారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి గోవాకు ఏప్రిల్ 17వ తేదీన వెళ్లేందుకు ఏసీ బస్సును రెడ్ బస్ యాప్ ద్వారా కొంతమంది నేరుగా మరి కొందరు తరుణి లాజిస్టిక్స్ ను 25 మంది ప్రయాణికులు టికెట్ రిజర్వేషన్ చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి గోవాకు ఏసీ బస్ టిక్కెట్ రూ.1543 వసూలు చేశారు. ఈ నెల 17వ తేదీ రాత్రి 10 గంటల సమయానికి ఎల్బీనగర్ నుంచి బస్సు బయలుదేరింది. బస్సు లో ఏసీ కండిషన్ వ్యవస్థ లేదు. ఇంజన్ ఆయిల్ నుం చి లీకేజితోపాటు తీవ్ర దుర్గంధం వస్తుండటంతో ఎస్ఆర్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద బస్సు ఆపి కిందకు దిగారు. బస్సు టైర్లు అరిగిపోయి ఉన్నాయి. అత్యంత ప్రమాదభరితంగా బస్సు ఉండటంతో ట్రావెల్స్ బస్సు ఆపరేటర్‌తో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఎంపి45 జడ్ఈ 7529 బస్సు నెంబర్ టిక్కెట్ ఉందని..కానీ మరో బస్సు ఎంపి 45 జడ్ఈ7505 బస్సులో ప్రయాణికుల్ని ఎక్కించారని వాపోయారు. తరుణి ట్రావెల్స్ నిర్వాహణ లోపం, మోసంపై నిలదీశారు. బస్సులో భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేశారని, తరుణి ట్రాన్స్ అండ్ లాజిస్టిక్స్ పై చర్యలు తీసుకోవాలని, లోపభూయిష్టమైన రెడ్ బస్ యాప్ నిర్వాహకులు బాధ్యత లేకుండా వ్యవహరించారని సిద్దిపేటకు చెందిన ఐటీ ఉద్యోగి ఎం.మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐ ఆర్ కేసును నమోదు చేసి ఎల్బీనగర్ కు కేసును బదిలీ చేస్తున్నామని మధురానగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. కొంత మంది ప్రయాణికులు మరో బస్సు బుక్ చేసుకున్నారని మరి కొందరు రూఫండ్ ఇప్పించాలని ప్రయాణికులు వెళ్లిపోయారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఏడాదిపాటు దేశవ్యాప్తంగా భూదాన ఉద్యమం

వజ్రోత్సవాలుఃవెదిరె అరవింద్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెదిరె అరవింద్‌రెడ్డి

రవీంద్రభారతి, ఏప్రిల్ 18:మహాత్మా గాంధీ ఆధ్యాత్మిక వారసుడు ఆచార్యా వినోభాభావే చేపట్టిన స్వరాజ్యం, సర్వోదయ ఉద్యమాలలో భాగంగా భూమిలేని గ్రామీణ పేదలను సాధికారతను తీసుకురావడానికి ఏప్రిల్ 18, 1950లో తెలంగాణలోని పోచంపల్లిలో భూదాన ఉద్యమం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా విస్తరించబడి 75 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నామని అఖిలభారత సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈరోజు మహారాష్ట్రలోని కొల్లాపూర్ పట్టణంలో భూదాన్ వజ్రోత్సవాలను ప్రారంభిస్తున్నామని,అనంతరం ఏడాది పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో, జిల్లాలో జరుగుతాయని, 2025 జూలై 17న హైదరాబాద్‌లో లక్ష మందితో ఈ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ఆచార్య వినోభాభావే పోచంపల్లిలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించిన అనంతరం మొదటి ప్రయత్నంగా మా తాత సామాజిక కార్యకర్త వెదిరె రామచంద్రారెడ్డిని కలిసి భూమిని దానం చేయమని అభ్యర్థించగా .. వెంటనే స్పందించి 100 ఎకరాలు ఆ తరువాత 800 ఎకరాలు, ఆ తరువాత 1000 ఎకరాలు దానం చేశారని గుర్తు చేశారు. కొందరుఅక్రమార్కులు వెదిరె రామచంద్రారెడ్డి కుటుంబసభ్యుల పేర్లు చెప్పి భూదాన భూములు అమ్ముకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, వారిపై చట్టపరమైన చర్యలుతీసుకుంటామన్నారు. తోలుపు నూరి కృష్ణగౌడ్, వెదిరె ప్రోమోతీష్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణలో విఫలం

తాండూరు రూరల్, ఏప్రిల్ 18 : తాండూరులో ఈదురుగాలులతోపాటు వర్షం కురువడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విద్యుత్ సమస్య తలెత్తిన చోట అధికారులు పునరుద్ధరించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గౌతాపూర్, కోటబాసుపల్లి, కరణ్‌కోట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో పూర్తిగా కరెంట్ లేక చిమ్మచీకట్లో మగ్గాల్సి వచ్చింది. విద్యుత్ ఏఈ, ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో పని చేసే లైన్‌మెన్లపైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-330722

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-329239

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, బీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990, 9949520296. NT-336465

LOANS

★Mortgage, Housing & Business Loans from 10L Banks & Also Pvt. Finance, Cibil Problem files also. No Advances. Ph: 9848547871. NT-336474

INSURANCE

★స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి లేదా ఏజెంట్‌గా చేరడానికి సంప్రదించండి. ఫోన్: 9000543747. NT-330862

PLOT FOR SALE

★టూరిజం హబ్! యాదాద్రి జిల్లా, ఆలేరు, కొలనుపాకలో ప్రీమియం ఓపెన్ ప్లాట్స్ అతి తక్కువ ధరలకే కలవు. EMI Option కూడ క